# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 25-02-2016**

'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు' అని పాటలు పాడుకునే జనం 'నేను ఖచ్చితంగా సర్కారు దవాఖానకే పోయి వైద్యం చేయించుకుంట' అనే పరిస్థితి రావాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అన్నారు. ప్రజలకు నిత్యం అవసరమయ్యే వైద్య సేవలు ప్రభుత్వ పరంగా అందాల్సిన అవసరం ఉందని సిఎం అన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ కోరినన్ని నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పి.హెచ్.సి.ల నుంచి మొదలుకుని టీచింగ్ హాస్పిటళ్ల వరకు అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో పరిస్థితి మెరుగు కావాలని సిఎం అన్నారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో ఖాళీగా ఉన్న డాక్టర్, ఇతర పోస్టులను వందకు వంద శాతం భర్తీ చేస్తామని, అవసరమనుకున్న పోస్టులను మంజూరు చేస్తామని, అన్ని వైద్యశాలల్లో అవసరమైన రోగ నిర్ధారణ పరికరాలు కొనుగోలు చేస్తామని, మందులు అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు. ప్రతీ హాస్పిటల్లో కొత్త బెడ్స్, చద్దర్లు, స్టాండ్స్ కొనుగోలు చేయాలని, రంగులు, సున్నాలు వేయాలని ఆదేశించారు. చద్దర్లు ఎప్పటికప్పుడు ఉతకడానికి, ఆసుపత్రి ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచేందుకు, మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ఆయా ఆసుపత్రుల సూపరింటెండెంట్ల దగ్గరే నిధులు పెడతామని వెల్లడించారు. చీపురు కొనాలన్నా సెక్రటేరియట్ అనుమతి తీసుకోవాల్సిన దుస్థితిని తొలగిస్తామని ఎక్కడికక్కడ అధికారాల బదలాయింపు, నిధుల వినియోగ అధికారం కల్పిస్తామని వెల్లడించారు. వైద్య,ఆరోగ్య శాఖలో పూర్తి స్థాయి సంస్కరణలు తెస్తామని, ప్రభుత్వ ఆసుపత్రులకు మంచిపేరు తేవాల్సిన బాధ్యత వైద్యులు తీసుకోవాలని కోరారు.

వైద్య ఆరోగ్య శాఖ బడ్జెట్ పై ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం క్యాంపు కార్యాలయంలో పునఃసమీక్ష నిర్వహించారు. మంత్రి సి.లక్ష్మారెడ్డి, ఎంపి బి. వినోద్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, వివిధ శాఖల కార్యదర్శులు బిపి ఆచార్య, తివారి, రామకృష్ణారావు, శివశంకర్, నవీన్ మిట్టల్, నర్సింగ్ రావు, బుద్ధ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హాస్పిటల్ వారీగా బడ్జెట్ కేటాయించాలని నిర్ణయించారు. కేటాయించిన డబ్బులను స్థానిక అవసరాల మేరకు వినియోగించుకునే హక్కును యూనిట్ సూపరింటెండ్లకు ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. హెచ్ఓడిల నుంచి అధికార వికేంద్రీకరణ జరగాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి వరకు తన పరిధిలో కావాల్సిన

పనులు తామే చేసుకోవడానికి అవకాశం ఇస్తామని వెల్లడించారు. అన్ని హాస్పిటల్స్ లో కావాల్సిన పరికరాలన్నీ కొనివ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఇందుకోసం ఎన్ని నిధులు అవసరమవుతాయో అంచనా వేసి బడ్జెట్లో నిధులు కేటాయించాలని సిఎం ఆదేశించారు. పరికరాల కొనుగోలు కోసం రాష్ట్ర స్థాయిలో మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, వైద్య విధాన పరిషత్ కమీషనర్ లతో కూడిన కమిటీ రేట్లను, నాణ్యతను నిర్ణయించాలని సిఎం ఆదేశించారు.

ఆసుపత్రుల వారీగా నిర్వహణ నిధులు కేటాయించి, వాటిని నెల వారీగా విడుదల చేయాలని సిఎం కేసీఆర్ చెప్పారు. దీనికోసం పిహెచ్సిలు, సిహెచ్సిలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, టీచింగ్ ఆసుపత్రుల వారీగా బెడ్ల సంఖ్య 21 వేలకు పైగా ఉందని అధికారులు తేల్చారు. బెడ్ వారీగా నిర్వహణ వ్యయం కేటాయించి, నెలవారీగా నిధులు విడుదల చేయడానికి సిఎం అంగీకరించారు. ఆ డబ్బులతో సదరు యూనిట్ ఆఫీసరే బెడ్స్ బాగుండేలా చూసుకోవాలని, బెడ్ షీట్స్ ప్రతీ రోజు ఉతికించాలని, ఆసుపత్రి ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్త పడాలని, టాయిలెట్లు శుభ్రంగా ఉంచాలని, మంచినీటి సౌకర్యం అందించాలని, దోమలు ఈగలు రాకుండా చూడాలని, ఎప్పటికప్పుడు సున్నాలు, రంగులు వేయాలని, లైట్లు, ఫ్యాన్లు పనిచేసే విధంగా చూడాలని సిఎం ఆదేశించారు. ఈ నిర్వహణ వ్యయం వీలైతే ప్రతీ నెల 25వ తేదీలోగా ఆయా ఆసుపత్రులకు అందాలని సిఎం చెప్పారు.

గ్రామీణ ప్రాంతాలు, ఏజన్సీ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాల్లో వైద్య సేవలు సరిగా అందేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ ప్రాంతాల్లో పనిచేయడానికి వైద్యులు సుముఖంగా లేనందున వారికి కొన్ని వెసులుబాట్లు కల్పించాలని సిఎం నిర్ణయించారు. ఈ ప్రాంతాల్లో పనిచేసే వారికి అదనపు నగదు ప్రోత్సాహం అందచేయాలని, స్థానికంగానే నివాసముండాలనే నిబంధన సడలించి పక్క పట్టణంలో ఉండే అవకాశం కల్పించాలని, పిహెచ్సిలలో వైద్యుల సంఖ్యను పెంచి షిఫ్టు సిస్టమ్ లో పనిచేయించాలని సిఎం చెప్పారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్ ను కూడా వైద్య విధాన పరిషత్ పరిధిలోకి తెచ్చి, పిహెచ్సిలను మాత్రం పబ్లిక్ హెల్త్ పరిధిలోనే ఉంచాలని సిఎం వెల్లడించారు. 108, 104 సేవలను మరింత పటిష్టం చేయాలని, గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు, వైద్య సలహాలు మరింత సమర్థంగా అందాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

రోగ నిర్ధారణ కోసం ప్రజలు చాలా డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తుందని, ప్రైవేటు డయాగ్నసిస్ సెంటర్ల దోపిడీకి గురవుతున్నారని సిఎం అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితిని నివారించేందుకు ప్రభుత్వపరంగానే ఆయా ఆసుపత్రుల స్థాయిని బట్టి రోగ నిర్ధారణ జరగాలని చెప్పారు. ఇందుకు కావాల్సిన పరికరాలు కొనిస్తామని చెప్పారు. టీచింగ్ ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల్లో ఎంఆర్ఐ, సిటి స్కాన్ సహా అన్ని రకాల రోగ నిర్ధారణ

పరికరాలు అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ పరంగానే పరీక్షలు జరగాలని చెప్పారు. అన్ని ఆసుపత్రుల్లో మందులు ప్రజలకు ఉచితంగా అందచేయాలని, ఏ ఆసుపత్రిలో ఏ మందులుండాలనే విషయంలో ఆయా ఆసుపత్రుల సూపరింటెండెంట్లే నిర్ణయం తీసుకుని కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకం జబ్బు ఉంటుంది కాబట్టి, అన్ని ఆసుపత్రులకు ఒకే రకమైన మందులు పంపిణీ చేసే పాత పద్ధతికి స్వస్తి పలకాలని చెప్పారు. తక్కువ ధరలో మందులు దొరికేందుకు వీలుగా రాష్ట్ర వ్యాప్తంగా విరివిగా జనరిక్ మందుల దుకాణాలు ప్రారంభించాలని సిఎం ఆదేశించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా ఎన్ని నిధులు కావాలో కూడా అధికారులు అంచనా వేశారు. అధికారులు అడిగిన నిధులన్నీ బడ్జెట్లో కేటాయించడానికి సిఎం అంగీకరించారు. అడిగినన్ని డబ్బులు ఇస్తామని, కావాల్సినన్ని పరికరాలు కొనిస్తామని, పిహెచ్సి వైద్యాధికారి వరకు అధికారాలు బదలాయిస్తామని, నిధులు అందుబాటులో ఉంచుతామని చెప్పిన సిఎం... దానికి ప్రతిఫలంగా ప్రజలంతా ప్రభుత్వ వైద్యం పట్ల నమ్మకం పెంచుకునేలా చూడాలని కోరారు. తెలంగాణలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందుతున్నదనే మాట రావాలని సిఎం కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజావైద్యాన్ని మెరుగు పర్చడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా ప్రభుత్వాసుపత్రుల్లో రోగుల సంఖ్య పెరుగుతున్నదని, ప్రజల్లో నమ్మకం పెరిగందని, దానికనుగుణంగా వైద్య, ఆరోగ్య శాఖ పటిష్టం కావాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్యాన్సర్, గైనకాలజీ, పీడియాట్రిక్ తదితర విభాగాలన్నీ మరింత మెరుగు కావాల్సిన అవసరం ఉందన్నారు.

**సిపిఆర్ఓ టు సిఎం**